ప్రజాశక్తి
శనివారం 1 జూన్ 2024 5 అనంతపురం

తాడిపత్రిలో కేంద్ర సాయుధ బలగాల పహరా

తాడిపత్రిలో భద్రత కట్టుదిట్టం

ప్రజాశక్తి - తాడిపత్రి

సార్వత్రిక ఎన్నికల చివరి దశ అనంతరం వెలువడనున్న ఎగ్జిట్ పోల్స్, నాలుగవ తేదీ ఎన్నికల లెక్కింపు సందర్భంగా తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇరువురి నాయకుల ఇళ్ల వద్ద ముళ్లకంచెలు ఏర్పాటు చేసి అభిమానులు కార్యకర్తలు గుమి కూడకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పట్టణంలో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు చేస్తూ డీఐజీ తాడిపత్రిలో మకాం వేసి శాంతి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. తాడిపత్రిలో పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణ నేపథ్యంలో తాడిపత్రిలో భారీగా పోలీసులను మోహరించి శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చారు. తాజాగా జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా తాడిపత్రి పట్టణంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి నివాసాల వద్ద పోలీసులు ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. కౌంటింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తాడిపత్రికి భారీగా కేంద్ర సాయుధ బలగాలు, ఏపీఎస్పీ బలగాలు చేరుకున్నాయి. జూన్ 6వ తేదీ వరకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డిని తాడిపత్రిలోకి వెళ్లవద్దని ఆంక్షలు ఉన్నందున పోలీసులు తాడిపత్రి చుట్టుపక్కల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పట్టణంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల కేసులో నిందితుల అరెస్టులు కొనసాగుతున్నాయి. వాటికి సంబంధించి ఏడు కేసులు నమోదు కాగా ఇప్పటికే 134 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ హైదరాబాదులో ఒక నాయకునికి సంబంధించిన అనుచరులను 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారి కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలో డిఐజి ఆదేశాల మేరకు డిఎస్‌పి జనార్ధన నాయుడు ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తు అల్లర్లు, గొడవల కు దిగితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా పార్టీల కార్యకర్తలకు, ఇరు కుటుంబాల అభిమానులకు హెచ్చరిక చేస్తూ శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగదని పట్టణ ప్రజలకు భరోసానిస్తున్నారు. పట్టణంలో ప్రస్తుతం సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం చట్ట విరుద్ధమని 144 సెక్షన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

నాయకుల ఇళ్ల ముందు వేసిన ఇనుప ముళ్లకంచె

ఎగ్జిట్‌పోల్స్ ఉత్కంఠ

◆సర్వత్రా అదే చర్చ ◆బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎక్కడ చూసినా అదే చర్చ. ఎగ్జిట్ పోల్స్ ఏ రకంగా ఉండనున్నాయన్నదే. ఎవరికి అనుకూలంగా ఉండనున్నాయి..ఎవరికి ప్రతికూలంగా ఉండనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలు పూర్తయినప్పటి నుంచి అనేక ఊహగానాలు సాగుతున్నాయి.. ఎగ్జిట్‌పోల్స్ అనే సరికి ఫలితాల ముందు వచ్చే సెమీఫైనల్‌లాగా భావిస్తున్నారు. ప్రధానంగా ఓట్ల ఫలితాలపై అభ్యర్థుల కంటే బెట్టింగులు కాసే వారిలో ఉత్కంఠ ఎక్కువగా కనిపిస్తోంది. శనివారం సాయంత్రం ఎగ్జిట్‌ఫోల్స్ వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఏ ఎగ్జిట్‌పోల్స్ ఏ రకంగా ఉండనున్నాయన్న చర్చ నడుస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ తమకు అనుకూలంగా ఉండనున్నాయని అధికార వైసిపి భావిస్తుండగా, లేదు తమకు అనుకూలమని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు చెబుతున్నారు. జిల్లాలోనూ దీనిపై అనేక చర్చలు నడుస్తున్నాయి. మెజార్టీ స్థానాలు వైసిపి కైవసం చేసుకుంటుందని ఆపార్టీ నాయకులు చెబుతున్నారు. కాదు తామే ఎక్కువ సీట్లు గెలుస్తామని టిడిపి నాయకులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో ఏ స్థానంలో ఎవరు గెలుపొందే అవకాశముందన్న అంచనాలు ఇది వరకే ఉన్నాయి. అయితే ఎగ్జిట్ ఫోల్ ఫలితాలు మరింతగా రూఢీ చేయనున్నాయన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. గతంలోనూ 2019లో ఇదే రకంగా బెట్టింగులు జరిగాయి. అప్పుడు కొంత మంది లాభపడగా, మరికొంత మంది నిండామునిగి ఉన్న డబ్బులు పొగొట్టుకున్నారు. ఈసారి గెలుపుపై ఏ పార్టీలోనూ ధీమా వ్యక్తం చేసే పరిస్థితుల్లేవు. ఎందుకంటే అటు కూటమి, ఇటు వైసిపి ఒంటరి కావడంతో ఫలితాలు ఏ రకంగా ఉండనున్నాయన్న సందిగ్ధత ఇప్పటికీ ఉంది. ఈ నేపథ్యంలో అందరి ముందస్తు ఆశలు ఎగ్జిట్‌పోల్స్‌పైనే ఉన్నాయి. దాన్ని బట్టి జూన్ నాలుగున ఫలితాలు ఏ రకంగా ఉండనున్నాయన్న ఒక ప్రాథమిక అంచనాకు వచ్చే అవకాశాలుండనున్నాయి.

బెట్టింగురాయుళ్లలో మరింత ఉత్కంఠ

ఎగ్జిట్‌పోల్స్‌పై అభ్యర్థుల కంటే బెట్టింగురాయుళ్లలో ఎక్కువ ఉత్కంఠ నెలకొంది. ఎందుకంటే ఎన్నికలు పూర్తయినప్పటి నుంచే బెట్టింగులు పెద్దఎత్తున మొదలయ్యాయి. ఒకటికి రెండు అని, ఒకటికి ఐదు అని ఇలా రకరకాలుగా బెట్టింగులు నడిచాయి. ఈ బెట్టింగు డబ్బులు పెట్టుకోవడం కోసమే ప్రత్యేకమైన కార్యాలయాలు కూడా ప్రారంభమయ్యాయన్న ప్రచారమూ నడుస్తోంది. మొత్తానికి కోట్లలోనే బెట్టింగులు ఇప్పటికే నడిచాయి. ఈ బెట్టింగురాయుళ్లలో ఈ ఎగ్జిట్‌పోల్స్ మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. తాము పందెం కాసిన పార్టీ లేదా అభ్యర్థికి అనుకూలంగా వస్తే ఫలితాల వరకు ఉత్సాహం నెలకొంటుంది. వ్యతిరేకంగా ఉంటే మాత్రం మంగళవారం వరకు బిక్కుబిక్కుమనే పరిస్థితులు ఉండనున్నాయి. ఏది ఏమైనా శనివారం సాయంత్రానికి ఎగ్జిట్‌పోల్స్ రానున్నాయి. ఆ తరువాత మంగళవారం రోజు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ పోల్స్ తరువాత బెట్టింగు జోరు మరింత పెరిగే అవకాశాలూ లేకపోలేదన్న చర్చ నడుస్తోంది.

పక్కాగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి. వినోద్ కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికలు – 2024లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై అడిషన్ ఎఆర్‌ఒలు, ఎఆర్‌ఒలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కు సంబంధించి ఎన్నికల కమిషన్ లేటెస్ట్ మార్గదర్శకాలను ఇచ్చిందని, వాటిని పాటిస్తూ కౌంటింగ్ చేపట్టాలన్నారు. కౌంటింగ్ లో కవర్, ఆథరైజేషన్ లెటర్, బ్యాలెట్ ముఖ్యమైనదని, ఆథరైజేషన్‌లో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని అన్నారు. ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్, వీవీప్యాట్ స్లిప్ ల కౌంటింగ్ నిర్వహించాలని, ఇందులో ఎలాంటి ఒత్తిడి ఉండకుండా కౌంటింగ్ చేసేలా చూసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, వీవీప్యాట్ స్లిప్‌ల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.
ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే అన్ని విధాలా సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్, వీవీప్యాట్ స్లిప్‌ల కౌంటింగ్ పై పూర్తిగా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, రిటర్నింగ్ అధికారులు వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, కరుణకుమారి, పార్లమెంటరీ నియోజకవర్గం ఎఆర్‌ఒ రమేష్ రెడ్డి, నోడల్ అధికారులు ప్రభాకర్ రావు, చౌదరి, భాస్కర్ గురుస్వామిశెట్టి, రఘునాథ రెడ్డి, బసవరాజు, అడిషినల్ ఎఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

47,020 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

అనంతపురం : జిల్లాలో శుక్రవారం నాటికి 53,415 మంది రైతులకు 47,020 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ కాయల కోసం ఆర్‌బికెల్లో 70,086 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందుకు అనుగుణంగా వేరుశనగ సిద్ధం చేశామన్నారు.

టిడిపి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల శిక్షణకు జిల్లా నాయకులు

నార్పల : విజయవాడ టిడిపి కేంద్ర కార్యాలయంలో చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల శిక్షణకు జిల్లా నాయకులు హాజరయ్యారు. జిల్లాకు చెందిన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ ఆలం నరసానాయుడు, అనంతపురం చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ గాజుల అదెన్న, రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళి, కృష్ణకుమార్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా కౌటింగ్ రోజు ఎలా వ్యవహరించాలన్న దానిపై టిడిపి సీనియర్ నేతలు, లీగల్ సెల్ నాయకులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఎస్‌కెయు బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనే శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం జట్టును ఉపకులపతి హుస్సేన్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈనెల 6 నుంచి 4వ తేదీ వరకూ తమిళనాడు రాష్ట్రంలోని చెన్నయి జెప్పియార్ యూనివర్సిటీలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జట్టు పాల్గొననున్నట్లు విసి తెలిపారు. జట్టు సభ్యులుగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం బికాం చదువుతున్న తలారి మదన్‌మోహన్, ఎం.ఎస్.సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న గుండ్లపల్లి మనోహర్, బి.ఎ తృతీయ సంవత్సరం చదువుతున్న బంగారు హరికృష్ణ, మొదటి సంవత్సరం బిఎ చదువుతున్న బింగి శ్రీకాంత్, ఎస్‌కెయు ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న జె.కళ్యాణ్ బాబు, ధర్మవరం వివేకానంద జూనియర్ కళాశాలలో బి.కాం తృతీయ సంవత్సరం చదువున్న తనకల్లు చెరువు మహ్మద్ సాదిక్, సాకే పెడబాబు, ధర్మవరం కె.హెచ్.డిగ్రీ కళాశాలలో బి.ఎ మొదట సంవత్సరం చదువుతున్న దాసరి లోకేష్, గుంతకల్లు శ్రీవివేకానంద కళాశాలలో ఎంసీఏ చదువున్న తలారి అనిల్, అనంతపురం సాయిసిద్దార్థ డిగ్రీ కళాశాలలో ఎం.వంశీకృష్ణ ఎంపికయ్యారు. టీమ్ మేనేజర్ కోచ్‌గా ధనలక్ష్మి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.ఎన్.ధనుంజయను నియమించారు. వీరికి విసి హుసేన్‌రెడ్డి అభినందనలు తెలిపి క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ ఈకార్యక్రమంలో ఎస్‌కెయు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఎం.వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు బాల్ బ్యాడ్మింటన్ జట్టుతో విసి హుస్సేన్‌రెడ్డి

అత్యవసరమైతే తప్ప బయటకు రాకండి

కౌంటింగ్‌కి పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తితో టౌన్, రూరల్ డీఎస్పీలు ప్రతాప్, శివారెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఈనెల 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని టౌన్, రూరల్ డీఎస్పీలు ప్రతాప్‌కుమార్, బీవీ.శివారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు సైపుల్లా శ్మశాన వాటిక నుంచి జెఎన్‌టియు వరకూ 23లైన్లను బారికేడ్లతో మూసివేశామన్నారు. అలాగే భైరవనగర్ ప్రాంతంలో 1 నుంచి 15 లైన్లను సైతం మూసివేశామన్నారు. ఏజెంట్లు, నాయకుల పార్కింగ్ కోసం జెఎన్‌టియు సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద స్థలాన్ని కేటాయించామన్నారు. జెఎన్‌టియు సమీపంలోని ఇళ్లల్లో కొత్త వ్యక్తులు, బంధువులు ఉండకూడదని నోటీసులు ఇచ్చామన్నారు. ఏజెంట్లను సైతం అనుమతించిన 3 గేట్ల ద్వారా మాత్రమే లోపలకు పంపుతామన్నారు. నగరంలో సైతం ఒక్కో పోలీసు స్టేషన్ పరిధిలో 2 మొబైల్ పార్టీలతో నిరంతర నిఘా, ఉన్న సీసీ కెమెరాలకు తోడు సమస్యాత్మక ప్రాంతాల్లో 84 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ రోజు, ముగిసిన అనంతరం ఎలాంటి ఘర్షణలకూ తావు లేకుండా గ్రామాల్లో పికెటింగ్ లు ఏర్పాటు చేశామన్నారు.

రాత్రి వేళల్లో సైతం పికెటింగ్

సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి వేళల్లో సైతం పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు రూరల్ డీఎస్పీ బివీ శివారెడ్డి తెలిపారు. కౌంటింగ్ రోజు, ముగిసిన అనంతరం గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలకూ తావు లేకుండా నియోజకవర్గంలోని 3 మండలాల పరిధిలోని 19 సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ తో పాటు పికెటింగ్ లు ఏర్పాటు చేశామన్నారు. బౌండోవర్ చేసిన వారు తిరిగి అల్లర్లకు దిగితే వారి నుంచి బౌండోవర్ చేసిన మొత్తాన్ని జరిమానాగా వసూలు చేస్తామన్నారు. లేకుంటే రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. బాణాసంచా కాల్చడం నిషేధించామని, ఎవరైనా నిలువ ఉంచినా, కాల్చినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నాయకురాలు నాగమణి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వంట ఏజెన్సీలకు ఇస్తున్న మెనూఛార్జీల రేట్లు పెంచాలన్నారు. పాఠశాలలకు కమర్షియల్ సిలిండర్లను మంజూరు చేయాలన్నారు. అంతేకాకుండా గౌరవ వేతనం రూ.5వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీల మండట కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎలంజి ఆంజనేయులు, కార్యదర్శిగా సోమశేఖర్ వన్నల్లి, ట్రెజరర్‌గా గోపాల్, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య చంద్రగిరి, గౌరవాధ్యక్షులు, ఓబులేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్దేహాళ్ ఆంజనేయులు, గోవిందవాడ హొన్నూరుస్వామి, వంట ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న కెఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 02:30 నుంచి 05:30 గంటల వరకూ రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 34 కళాశాలల్లో థియరీ ఎగ్జామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగరత్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 56.48 శాతం గైర్హాజరు

అనంతపురం సిటీ : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 56.48 శాతం మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల విభాగం ఎసి గోవిందనాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 45 సెంటర్లలో సోషియల్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 4,774 మంది హాజరు కావాల్సి ఉండగా 2,696 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 2078మంది సోసిషయల్ పరీక్ష రాసినట్లు తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తనిఖీ చేశారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

జెఎన్‌టియు పరిసరాల ఇళ్లల్లో కొత్త వ్యక్తులు ఉండొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ గౌతమిశాలి హెచ్చరించారు. ఈమేరకు సాధారణ ఎన్నికల ఫలితాలను లెక్కింటే నగరంలోని జెఎన్‌టియు పరిసరాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర సాయుధ బలగాలతో భారీ కవాతు నిర్వహించారు. జెఎన్‌టియు ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమై సూపర్ స్పెషాలిటీ, ఆసుపత్రి క్రాస్, బైరవనగర్, ప్రసన్నాయపల్లి పంచాయతీ కార్యాలయం, ఎల్‌ఆర్‌జి స్కూల్, చిన్మయనగర్, పాలిటెక్నిక్ కళాశాల, తిరిగి జెఎన్‌టియు వరకూ ఫ్లాగ్‌మార్చ్ సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ ముగిసేంత వరకూ జెఎన్‌టియు, పరిసరాలు పోలీసుల గుప్పిట్లో ఉంటాయన్నారు. కౌంటింగు వేళ, గొడవలు, అల్లర్లు జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. జెఎన్‌టియుతోపాటు పరిసరాల్లో 144 సెక్షన్ ఉత్తర్వులు అమలులో ఉంటుందన్నారు. అలాగే 30 పోలీసు యాక్టు అమలులో భాగంగా ర్యాలీలు, విజయోత్సవాలు నిర్వహించరాదన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 3 కిలో మీటర్ల పరిధి రెడ్ జోన్ కింద ప్రకటించామని, దీని ప్రకారం ఎవరూ డ్రోన్లు ఎగురవేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ, గ్రేహౌండ్స్ డీఎస్పీలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డీఎస్పీలు, బలగాలు, సిఐలు రెడ్డెప్ప, ధరణీకిశోర్, నారాయణరెడ్డి, ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, మధు, అనంతపురం పిటిసి అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు, నగర పోలీసు సిబ్బంది, ఫైర్ సిబ్బంది, వజ్ర, వాటర్ కేనన్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు పరిసర ప్రాంతాల్లో భారీ కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

భూ సమస్యలతో భార్యాభర్తలపై దాడి

బాధితులు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడి తల్లిదండ్రులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని తరిమెల గ్రామంలో భూ సమస్యలతో దాడి చేసినట్లు గ్రామానికి చెందిన సుబ్బ నరసయ్య, భార్య నాగజ్యోతి వాపోయారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తరిమెల కల్లుమడి గ్రామానికి మధ్యలో పశుగ్రాసం కోసం రెండెకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే అదేగ్రామానికి చెందిన ఎట్టి సురేష్ ఎలాంటి ఆధారాలు లేకుండా తమ భూమిని సాగు చేసుకునేందుకు దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. గతంలో చేను కంచెను కూడా నిప్పంటించాడని వాపోయారు. ఈ విషయమై అనేకసార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఈనేపథ్యంలో గత ఆదివారం తనతోపాటు కుమారుడు ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు తరిమెల గిరితో కలిసి ఉదయం ట్రాక్టర్‌తో భూమిని దుక్కులు చేశామన్నారు. అయితే నాలుగు రోజుల తర్వాత శుక్రవారం నరసయ్య నిర్వహిస్తున్న అంగట్లో ఉండగా మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో దాడి చేశాడు. దెబ్బలు తట్టుకోలేక గట్టిగా అరవడంతో

గాయపడిన నరసయ్య

నరసయ్య భార్య అంగట్లోకి వచ్చి చూసింది. విపరీతంగా కొడుతుండగా అడ్డుకోబోయిన భార్యను కూడా అసభ్యంగా ప్రవర్తిస్తూ దాడి చేశాడు. వెంటనే ఆటోలో వైద్యం నిమిత్తం శింగనమలకు వెళ్తుండగా ఆటో డ్రైవర్లను బెదిరించి వెళ్లకుండా చేశాడని వాపోయారు. దిక్కుతోచక 108కి ఫోన్ చేసి శింగనమల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తమ తల్లిదండ్రులపై దాడి చేసిన ఎట్టి సురేష్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు తరిమెల గిరి డిమాండ్ చేశారు.

పొగాకు క్యాన్సర్‌కు కారకం

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

పొగాకు క్యాన్సర్‌కు కారకమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఎస్‌పిఎం విభాగం సెమినార్ హాల్లో సామాజిక వైద్య శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల ద్వారా ఊపిరితిత్తులు, ఇతర అవయవాలకు కాన్సర్ కలుగుతుందన్నారు. కావున పొగాకు వాడకాన్ని మానేయాలన్నారు. పొగాకు అలవాటును మాన్పించడానికి అన్ని జిల్లా ఆసుపత్రుల్లో ప్రభుత్వాలు డి అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగా ఎస్‌పిఎం విభాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి దర్శకత్వంలో 2021వ బ్యాచ్ వైద్య విద్యార్థులు ప్రదర్శించిన 'పొగా ఉత్పత్తులకు మీ పిల్లలను దూరంగా ఉంచండి' అనే లఘునాటిక అందరినీ ఆలోచింపజేసింది. నాటిక లో పాల్గొన్న అందరికీ ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందజేశారు. కళాశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్, శానిటేషన్ స్టాఫ్, వైద్య విద్యార్థులకు ఎస్‌పిఎం విభాగం ప్రొఫెసర్లు తెలుగు మధుసూదన్, వాల్మీకి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రధాన విభాగాధిపతి వేముల శ్రీనివాసులు, ఎస్‌పిఎం విభాగం ప్రధాన విభాగాధిపతి డాక్టర్ తెలుగు మధుసూదన్, ఎస్‌పిఎం అధ్యాపకులు వాల్మీకి శ్రీనివాస్, డాక్టర్లు సుమన గోపీచంద్, సుష్మ, శ్రీనివాసరావు, గీతాంజలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పామిడి : స్థానిక సామాజిక వైద్యశాలలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకును ఏరూపంలో తీసుకున్నా నష్టమే అన్నారు. పొగాకు శరీరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ముప్పువాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయన్నారు. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గొంతు క్యాన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా పీల్చే వారికి కూడా ప్రమాదమే అన్నారు. కావున ప్రతి ఒక్కరూ పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

గుత్తి : మండలంలోని తురకపల్లిలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మురళీ భార్య లక్ష్మీదేవి (40)కి కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లక్ష్మీదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

10మంది బైండోవర్

పుట్లూరు : ఈనెల 4న సాధారణ ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో మండలంలో 10మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని 10మందిని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి వద్ద హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బెలుగుప్ప : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బెలుగుప్ప గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప సొంతపని నిమిత్తం వెంకటాద్రిపల్లికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాంద్‌బాషా ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు.

విఆర్ఎ మహేష్ మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని శీర్పి విఆర్ఎ మహేష్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది శీర్పికి చేరుకుని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, ఆర్ఐ నగేష్‌బాబు మాట్లాడుతూ అందరితో మంచిగా విధులు నిర్వహించే విఆర్ఎ మహేష్ మృతిచెందడం బాధాకరమన్నారు. అనంతరం విఆర్ఒలు, విఆర్ఎలు ప్రభుత్వ జీవో ప్రకారం దహన సంస్కారాలు కోసం రూ.25 వేల నగుదును మహేష్ భార్యకు అందజేశారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, విఆర్ఒల మండల అధ్యక్షులు ఎర్రిస్వామి, రామసాగరం ఎర్రిస్వామి, మహేంద్రకుమార్, హరి, తదితరులు పాల్గొన్నారు.

అమిద్యాలకు చేరుకున్న శ్రీవారి ఉత్సవ విగ్రహాలు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగియడంతో శ్రీవారి ఉత్సవ మూర్తుల విగ్రహాలు తిరిగి అమిద్యాలకు చేరుకున్నాయి. ఉత్సవాలు ముగిసిన అనంతరం అమిద్యాలకు శ్రీవారి ఉత్సవ విగ్రహాలు తరలివెల్లడం ఆనవాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి పెన్నోబిలం నుంచి అమిద్యాలకు బోయీలు తీసుకెళ్లారు. ఉత్సవ విగ్రహాలు తిరిగి అమిద్యాల గ్రామానికి చేరుకోవడంతో ఉత్సవాలు ముగిశాయి. కాగా అమిద్యాలకు తిరిగొచ్చిన ఉత్సవ విగ్రహాలకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి పూజలు చేశారు. అనంతరం పెన్నోబిలేసు ఆలయానికి విగ్రహాలను చేర్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఒ విజయ్ కుమార్, అర్చకులు ద్వారాకనాథ్ స్వామి, మయూరం బాలాజీ, గుండురావు, ఆలయ సిబ్బంది దీపక్, నరసింహులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అమిద్యాలకు శ్రీవారి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న భక్తులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డీఎస్పీ బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ డి.శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని ముద్దినాయనపల్లి గ్రామంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీ నాయకులు, రౌడీషీటర్ల ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో వివిధ కేసుల్లో ఉన్న నేరస్తులను గుర్తించి చట్టాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల మూలంగా గ్రామాల్లో అరాచకాలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అన్నారు. అయితే రెండింటినీ సాధనంగా స్వాగతించాలని సూచించారు. బాణాసంచాలు పేల్చడం, ఊరేగింపులు చేయడం, గెలిచిన వారు ఓడిపోయిన వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ముద్దినాయనపల్లిలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎన్ఎస్‌యుఐ నేత హత్య బాధాకరం

వజ్రకరూరు : ఎన్ఎస్‌యుఐ నేత సంపత్‌కుమార్‌ను హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని బిజిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిత్యం విద్యార్థుల అభివృద్ధి కోసం అహర్నిశలు పోరాడుతూ చిన్న వయసులోనే మంచి పేరు తెచ్చుకుని అందరి మన్నన పొందిన సంపత్‌కుమార్‌ను ధర్మవరానికి చెందిన కొంతమంది కిరాయి హంతకులు హత్య చేయడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం తక్షణ స్పందించి హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి వారికి శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు.

5న ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై పోటీలు

వజ్రకరూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న విద్యార్థులకు ఆరు రకాల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలన్న లక్ష్యంతో ఉరవకొండలోని శ్రీ షిర్డీ సాయి ఆలయ కళ్యాణ మంటపంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం : ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తూ టెన్త్‌లో 450, ఇంటర్‌లో 750 మార్కులు సాధించిన విద్యార్థినులు పూలే అంబేద్కర్ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవలని మహాత్మాజోతిబా పూలే ట్రస్టు ఛైర్మన్ పోతుల నాగరాజు శుక్రవారం ప్రకటన లో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 25వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు తమ మార్కుల జాబితాను ట్రస్టు సభ్యుల వాట్సప్‌నకు పంపవచ్చని తెలిపారు. మిగతా వివరాలకు సెల్ 9966 807021, 83094 75846, 94949 33825, 94414 43923, 94944 35776, 94408 70020, 93984 06518, 99632 96066 నెంబర్లకు విద్యార్థులు తమ మార్కుల జాబితాను జూన్ 25వతేదీలోపు పంపాలని కోరారు.

సరస్వతీపుత్రుడికి 'టిఆర్ఆర్' చేయూత

అనంతపురం : 2023 నీట్‌లో జాతీయస్థాయిలో 7041, రాష్ట్రస్థాయిలో 281 ర్యాంకు సాధించిన విద్యార్థికి అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి చేయూతను అందించారు. అనంతపురంలోని 3వ రోడ్డులో ఉన్న జిఆర్ ఫంక్షన్‌హాల్‌లో నివసిస్తున్న రైతు ప్రసన్న కుమార్‌రెడ్డి కుమారుడు వరుణ్ కార్తీక్‌రెడ్డి 2023 బ్యాచ్ నీట్‌లో ర్యాంకు సాధించి ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీట్ సాధించాడు. అయితే పేదరికంతో బాధపడుతున్న కుటుంబానికి స్థానిక సంస్థ కార్యాలయంలో రమణారెడ్డి రూ.75,000 ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న రమణారెడ్డి

కౌంటింగ్ ప్రక్రియలో తప్పులు జరిగితే చర్యలు

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్, ఉరవకొండ రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ హెచ్చరించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో ఉన్న అడ్మిన్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలో కౌటింగ్ విధులు కేటాయించిన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల ఓట్లను ఏవిధంగా లెక్కించాలనే విషయాలను వివరించారు. కౌంటింగ్ సిబ్బంది అందరూ సరైన సమయంలో హాజరుకావాలన్నారు. తప్పక గుర్తింపు కార్డు ధరించి రావాలన్నారు. అలాగే మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్, తర్వాత ఇవిఎంల ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి 18 కౌంటింగ్ టేబుల్స్, 15 రౌండ్స్, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 14 కౌంటింగ్ టేబుల్స్, 18 రౌండ్స్ ద్వారా లెక్కింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని తహశీల్దార్లు, ఎంపిడిఓలు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-వజ్రకరూరు

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ప్రయివేట్ విద్యాసంస్థలు దోపిడీలను అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధార్థ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉరవకొండ మండల కేంద్రంలో ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీలకు పాల్పడుతున్నాయన్నారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. అయినా విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో ఉన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు బహిరంగంగా ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, అధిక ఫీజులు అరికట్టాలని, పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు.

వికలాంగ పిల్లల ఇంటింటి సర్వే

వివరాలు సేకరిస్తున్న ఉద్యోగి

శింగనమల : సమగ్ర శిక్ష చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మండలంలో దివ్యాంగ పిల్లల ఇంటింటి సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ఎంఇఒలు నరసింహారాజు, శివప్రసాద్ పర్యవేక్షణలో మండలంలోని ప్రతి గ్రామంలో 0-18ఏళ్ల దివ్యాంగ పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల భవిత కేంద్రంలో ఐఇఆర్పిలుగా పని చేస్తున్న భాగ్యలక్ష్మి, లోకేష్ ఇంటింటికీ వెళ్లి దివ్యాంగ పిల్లల వివరాలు గుర్తిస్తున్నారు.

పుట్లూరు : మండలవ్యాపంగా 0-18ఏళ్లలోపు శారీరక, మానసిక దివ్యాంగులను గుర్తిస్తున్నట్లు మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం ఐఆర్‌పిలు లిసుదర్శన్‌రెడ్డి, వాణిశ్రీ ఇంటింటికీ వెళ్లికాళ్లు, చేతులు సరిగ్గా లేని పిల్లలను గుర్తించి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగి

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టైపిస్టుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఎం.నారాయణప్పను కళాశాల సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నారాయణప్ప కళాశాలలో చేసిన సేవలు మరువలేనివన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఎప్పుడు వచ్చినా తక్షణమే ఇచ్చి పంపేవారన్నారు. విద్యార్థులకు ఎప్పుడూ ఇబ్బందులకు గురిచేసిన రోజులు లేవన్నారు.

నారాయణప్ప దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వైభవంగా హనుమజ్జయంతి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

హనుమజ్జయంతి ఉత్సవాల్లో దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధి చెందిన కసాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవంగా పూజలు చేశారు. ఇందులో భాగంగా అనేక రకాల పండ్లతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముందుగా మూలవిరాట్‌కు అర్చన, అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర కలశాలతో అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ మాలలను కూర్చి అలంకరించారు. తర్వాత సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ ఉత్సవమూర్తులను యాగా మండమంలో కొలువుదీర్చి సుందరకాండ, మన్యసూక్త హోమాలు, శ్రీరామ ఆంజనేయ స్వాముల మూలమంత్ర అనుస్టాన హోమాలు, హారతులు సమర్పించారు. సాయంకాలం ఉత్సవమూర్తులకు మల్లెపూలతో లక్ష హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి మల్లెపూలతో లక్ష హోమాలు చేసిన అర్చకులు

జనన, మరణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ సుజాత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

జనన, మరణాలపై వైద్యసిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఓ సుజాత సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఇంద్రమ్మ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటా పర్యవేక్షించి పిల్లలకు ఆరోగ్య టీకాలు వేయడంతోపాటు రోగాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల స్థితిగతులపై ప్రత్యేక రికార్డులు తయారు చేయాలన్నారు. ఆయా విషయాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ రవిశంకర్, ఏరియా ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్, సబ్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఓ సుజాత

గ్రామాల్లో గొడవలకు వెళ్లొద్దు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఈనెల 4న సాధారణ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని ఇటుకులపల్లి సిఐ నరేంద్రరెడ్డి సూచించారు. ఎస్పీ గౌతమీశాలి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల పార్టీల నేతలతో ఎస్ఐ మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కౌంటింగ్ రోజు ప్రశాంత వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. ఎవరు గెలిచినా బాణాసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధం అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆత్మకూరులో మాట్లాడుతున్న సిఐ నరేంద్రరెడ్డి

పుట్లూరు : గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సిఐ సుబ్రమణ్యాం సూచించారు. ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో మండల పరిధిలోని సూరేపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో మాట్లాడుతున్న పోలీసులు

పెద్దపప్పూరు : మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో ఎస్ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాలు వచ్చాక ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి ప్రశాంతంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బొమ్మనహాల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఇఒ మల్లికార్జున సూచించారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, బలమైన ఆహారం అందించాలన్నారు. ఏరోజుకారోజు తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. ప్రభుత నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వాహకులతోపాటు ఎంఆర్‌సి సిబ్బంది అమ్రేష్, అశోక్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక సహాయకులకు శిక్షణ

పశువుల పోస్టుమార్టంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

బెలుగుప్ప : నూతనంగా ఎంపికైన పశుసంవర్ధక సహాయకులకు పశువుల శవ పరీక్షలపై పశువైద్యాధికారి రమేష్ శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా అంకంపల్లి గ్రామానికి చెందిన కురుబ భీమలింగయ్యకు చెందిన గొర్రె అనారోగ్యంతో మృతిచెందడంతో గొర్రెకు పోస్టుమార్టం నిర్వహించి శవ పరీక్ష ఎలా చేయాలో వివరించారు. అలాగే వ్యాధి లక్షణాలను ఎలా గుర్తించాలనే అంశంపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు

సూపర్‌స్టార్ కృష్ణకు నివాళి

అనంతపురం : తెలుగు సినిమా నటుడు సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన అభిమాన సంఘం నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. కమలానగర్‌లోని మహిళా వృద్ధాశ్రమంలో కేక్ కోసి అన్నదానం చేశారు. అదేవిధంగా బైరవనగర్ అనాథాశ్రమంలో విద్యార్థులకు బ్రెడ్లు, నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘం నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, విజయకృష్ణ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ ఐదు దశాబ్దాలకుపైగా సినీజీవితం గడిపారన్నారు. ఆయన సినీజీవితంలో సుమారు 340 పైచిలుకు సినిమాల్లో ప్రధాన పాత్రలో నటించి ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నూర్ మహమ్మద్, జుటూరు శ్రీనివాసులు, అలం షేక్షావలి, జి.రాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోస్తున్న కృష్ణ అభిమాన సంఘం నాయకులు

ముగిసిన ఇస్లామిక్ సమ్మర్‌క్యాంప్

రాయదుర్గం : స్థానిక ముస్లిం మత గురువులు, హెల్పింగ్ హాండ్స్ సహకారంతో చేపట్టిన నెలరోజుల ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక మక్కా మసీదులో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బెంగళూరుకు చెందిన ముఫ్తి తాహిర్‌సాబ్ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయత, విధేయతతో మెలగాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న పిల్లలకు బహుమతులు అందజేశారు. జామియా, టిప్పు, మక్కా, మదీనా మసీదులకు చెందిన నిర్వాహకులు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరానికి అవసరమైన సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న పిల్లలు, మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మతపెద్దలు

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు కూరాకుల ప్రభుప్రసాద్ తండ్రిగారు రామచంద్రయ్య వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సోదామణి, సుబ్రమణ్యాం, ఓబుళపతి, సుబ్బారావు, కుళ్లాయప్ప, వెంకటేష్, రఫీ, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు